# రాగబంధం

రాత్రి రెండు గంటల సమయం నిశితో పాటు నిశ్శబ్దం కూడా లోకాన్ని ఆవరించుకుంది. నిద్రలో ఎవరి కలల జగత్తు వారిది. ఒకరికీ మరొకరికీ మధ్య అనుబంధాలకు తావు ఇవ్వని స్వప్నసుందరి కలత నిద్రతో ఎందరినో కలల లోకాలలో విహరింపచేస్తుంది. గాఢ నిద్రలో ఉన్నవారి అదృష్టమైతే వర్ణనాతీతం. వారు సగం సమాధి స్థితిలో ఉన్నట్టే. అర్ధరాత్రి సమయం పరమేశం మేష్టార్ని మాత్రం ఈ రెండు అదృష్టాలలో ఏ ఒక్కటీ వరించలేదు. దరిద్రావస్థలో వున్న వారికి ఆకలి, నిద్ర అధికం అంటారు. మాష్టారు విషయంలో ఆ మాట నిజం కాలేదు. ఆకలి మాట ఏమో కాని అతని కళ్ళకు ఎంతో కాలంగా నిద్ర మాత్రం కరువైపోవటం యదార్థం. వీధి వసారాలో ఆ అర్ధరాత్రి వేళలో అందుకే పరమేశం మాష్టారు పచార్లు చేస్తున్నారు.

శీతకాలపు చలి తగిన రక్షణ ఇవ్వలేని వస్త్రధారణలో ఉన్న పరమేశం మాష్టారిని నిలువునా వణికించేస్తోంది. గుండెలో రగులుతున్న ఆవేదనాగ్నులు ఈ చలిని తొలగించే శక్తి లేనివి. పరమేశం మాష్టారిది ఒంటరి బ్రతుకుకాదు. అనుకూలవతి అయిన ధర్మపత్నితో, రత్నాల్లాంటి ఇద్దరు సుపుత్రులతో కళకళలాగే తన సంసార రధానికి సారధి అతను. చదువుల గుడిలో ప్రాథమిక దశలో ఉన్న యెందరెందరో పసి విద్యార్థులను తీర్చిదిద్ది పై తరగతులకు పంపే పూజారే అతను. రెండింట తనవిధిని సక్రమంగానే నిర్వర్తించారు. పుత్ర రత్నాలను ప్రయోజకులుగా చేసారు. ఉత్సాహపడుతున్న పెద్ద కుమారుడ్ని పై చదువుల కోసం విదేశాలకు పంపారు. అతనక్కడే స్థిరపడి తిరిగి రాడన్నపుడు మాత్రం జీవితంలో తొలిసారిగా బాధతో కళ్లొత్తుకున్నారు.

రెండవకొడుకు వైద్య వృత్తిలో పట్టభద్రుడై స్వగ్రామంలోనే ఉద్యోగం సంపాదించు కున్నపుడు ఆ కళ్లల్లోనే నిలిచిన ఆనందభాష్పాలు కొడుకుకు ఆశీస్సుల అక్షింతలుగా చల్లారు.

కొడుకు పెళ్ళై కోడలు కాపురానికి వచ్చిన తరువాత పరమేశం మాష్టారికి భార్యకు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించినంత ఆనందంగా ఉండేది. పెద్ద కొడుకు పూర్తిగా దూరమైనా, చిన్నకొడుకు, కోడలితోనే కలిసి ఉంటున్నందుకు హాయిగా అనిపించేది. ఎంతో ప్రేమగా చూసుకునే కొడుకు, కోడలు ఉన్నందుకు అంతులేని తృప్తిగా ఉండేది. కాని ఆ అభిమానాలు ఎంతోకాలం నిలవవని తన పదవీకాలం పూర్తయి సంపాదన పోయిన తరువాత కాని పరమేశం మాష్టారికి, భార్య పార్వతికి తెలిసిరాలేదు. ఆ మార్పుకి తట్టుకోలేక పార్వతి కోడలుతో చిన్న చిన్న పేచీలు పెట్టుకున్న మాట యదార్థం. కాని పరమేశం మాష్టారికి ఆ పరిస్థితిని ఎదుర్కోవటం కష్టం అనిపించలేదు. భార్య అస్వస్థురాలైనపుడు మాత్రం అతని మనస్సు బాధలో విలవిలలాడిపోయింది. తీవ్రమైన క్షయ వ్యాధితో ఆవిడ బాధపడుతున్నా కొడుకు, కోడలు అది అంతగా పట్టించుకోనపుడు మాత్రం మౌనంగా ఉండలేకపోయారు. "ఏరా అబ్బాయ్. అమ్మని ఎక్కడి కైనా తీసుకొని వెళ్ళి వైద్య చేయిద్దాం. జబ్బు ఇక్కడ నయమయ్యేట్టు లేదు" అన్నారు. ఎందుకులే. ఎలాగా అమ్మ బ్రతికేది ఇంక కొద్ది కాలమే, ఎంత ఖర్చు చేసినా ఫలితం ఉండదని నాకు తెలుసు కొడుకు మాటలకు సహించలేకపోయారు. " సరియైన వైద్యం ఉంటే ఈ జబ్బు తగ్గటం ఏమంత కష్టం కాదని నాకూ తెలుసు. అయినా మన ప్రయత్నం మనం చేస్తే భగవంతుడు అనుకూలిస్తాడు". అన్నారు. కోడలు జోక్యం కల్పించుకుని " అలా ఖర్చు పెట్టడం మొదలుపెడితే ఇక్కడ సంపాందించే వాళ్ళు లేరు. తేరగా తిని కూర్చునేవారే అందరూ. అయినా ఇప్పుడేమీ మందులు లేక దిక్కులేని చావు ఛావదు మీ అబ్బాయి తోచిన వైద్యం చేస్తూనే ఉన్నారుగా." అంది.

తనే భార్యని ఎక్కడికైనా తీసుకువెళ్లి వైద్యం చేయించుకోవాలని ఉంది. కాని ఎలా. అందుకు అవసరమైన ధనం అతని దగ్గర లేదు. తెలిసిన వారెవరినైనా అడిగి. ఆ డబ్బుతో వైద్యం చేయ్యాలని ప్రయత్నిస్తూ ఉండగానే. తనకి డబ్బుతోనే కాదు ఈ లోకంతోనే పనిలేదన్నట్టు పరమేశం మాష్టారిని మానసికంగా ఒంటరిని చేసి వెళ్ళిపోయింది పార్వతి.

భార్యా వియోగం పరమేశం మాష్టారిని ఎంతగానో కృంగతీసింది. అతనికి ఎవరి ఓదార్పు లభించలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ, అతని ఉనికి కొడుకుకి, కోడలుకి కష్టంగా ఉందని, ఏ సంపాదన లేకుండా తిని కూర్చుంటున్నాడని, ప్రతిదానికి వాళ్ళు చూపించే విసుగు, అనే సూటిపోటి మాటల వలన పరమేశం మాష్టారికి అర్థం అవుతూనే ఉంది. అందుకే ఒకసారి పెద్దకొడుకుకి ఉత్తరం వ్రాస్తారు. దానికి అతను ఓ వింత ధోరణిలో జవాబు వ్రాసాడు.

"చూడండి నాన్న, ఇంకా మనదేశంలో ఇలా ముసలివాళ్ళతో పాకులాడుతున్నారు. కాని ఇక్కడైతే అలాలేదు. అలాంటి వాళ్ళను చూస్తే అసహ్యించుకుంటారు కూడా ! అది ఇక్కడ నాగరికతా లక్షణం కాదు. అందుకే నేను మమ్మల్ని తీసుకువెళ్ళడం జరగని పని. తమ్ముడు ఇంకా మంచివాడే కనుక మీకు అన్నం పెట్టి పోషిస్తున్నాడు." ఇంకా ఇలా ఏవేవో వ్రాసాడు. ఆ ఉత్తరం చదివేసరికి మాష్టారి తల తిరిగి పోయింది. ఎంతటి వాళ్లయ్యారు తన కొడుకులు అనుకొన్నారు బాధగా తను పదిమంది పిల్లన్ని పోగుచేసి ప్రవేట్లు చేబితే వాళ్లకి అగౌరవమట.

వాళ్ళ చిరాకు రోజు రోజుకూ పెరిగిపోతోంది. కోడలి ప్రవర్తన అయితే శృతి మించింది. "ఈ ముసలి వాడితో ఒకటే గొడవ, నాలుగు రోజులు పుట్టింటికి వెడదామన్నాకుదిరి చావదు." అంటుంది మామగారికి వినబడేలా. పార్వతే అదృష్టవంతురాలు. ఈ బంధాలన్నీ తెంచుకుని వెళ్ళి పోయింది. వీళ్ల పంచన ప్రతిరోజు మానసికంగా చచ్చిపోతూ బ్రతకలేదుతను. ఇవే ఆలోచనలతో అతనికి నిద్రరావటం లేదు.

కాని ఎలాతను ఒంటరిగా ఎక్కడికి వెడతాడు. బ్రతకటం ఎలా? ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఎక్కడికైనా వెళ్ళి, ఎలా అయినా శేష జీవితాన్ని గడిపితే బాగుండును. కన్న కొడుకు కోడలే అయినా వీళ్ళ మధ్య బ్రతకటం తనకు ప్రత్యక్ష నరకం. ఏదో మార్గం అన్వేషించాలి. ఏదోలా ఇంటి నుంచి బయటపడాలి. హఠాత్తుగా అతనికి ఓ మెరుపులాంటి ఊహవచ్చింది. అతని వేలి ఉంగరం తన బాధల నుంచి బయటపడేయగలదేమో. దాన్ని అమ్మేసి ఏచిన్న పల్లెలోనో కుటీరంలాంటి నివాసం ఏర్పరచుకుని పదిమంది పిల్లల్ని పోగుచేసి ప్రవేటు మాష్టారుగానైనా జీవితన్నా వెళ్ళబుచ్చగలడేమో ప్రయత్నించి చూడాలి.

తన చేతి సంచి తీసుకుని తనకున్న నాలుగు పంచెలు, ధోవతులు దానిలో పెట్టుకుని బయలుదేరాడు. నిశ్చలంగా నిద్రపోతున్న కొడుకు, కోడలు అతని స్థితిని గమనించరన్న ధైర్యంలో మాష్టారు తన దగ్గర ఉన్న 5 రూపాయలతో దగ్గరలోనే ఉన్న ఓ చిన్న పల్లెకు టికెట్టు తీసుకుని, బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న రైల్లో కాలుపెట్టాడు. తోటి ప్రయాణికుల మధ్య సర్దుకొని కూర్చున్నారు ఎందుకో తెలియని ఆనందంగా ఉంది. కొడుక్కి, కోడలికి తన బాధ వదిలినందుకేమో. వాళ్ళు రేపు తను గురించి ఏమనుకుంటారో ? ఏమనుకున్నా తనకేం సంబంధంలేదు ఇకపైన తన బ్రతుకు తనది ఈ వయస్సులో బ్రతుకుబాట వెతుక్కుంటూ గమ్యం తెలియని ప్రయాణం ప్రారంభించాడు తను. ఆ మాట తలుచుకుంటే అతని పెదవి పైన అదో మాదిరి నవ్వు విరిసింది. తను ప్రయాణం చేస్తూ అరగంట దాటింది. ఇంకాస్సేపటిలో తనకు తెలియని తను దిగవలసిన స్టేషన్ వచ్చేసుంది. పరమేశం మాష్టారి ఆలోచనలకు అంత రాయం కల్గిస్తూ ఎదురుగా సీటులోంచి ఒక వ్యక్తి " నమస్కారం మాష్టారు" అన్నాడు. ఉలిక్కి పడ్డారు. 'నన్నేనా' అన్నట్టు ఆ యువకుని వైపు చూసారు. "మిమ్మల్నే మాష్టారు" మిమ్మల్ని నేను ఎక్కడో చూసినట్టుంది. ఇందాకటి నుంచి

ఆలోచిస్తున్నాను. గుర్తురావటం లేదు. అతని మాటకు మాష్టారు కూడా ఒక సారి పరిశీలనగా అతని ముఖంలోకి చూసారు. కాని మాష్టారుకి కూడ ఏమి గుర్తు రాలేదు. "చూడు బాబు. నువ్వు ఎవరో నాకు తెలీదు. మీ బంధువు ఎవరైనా, పెద్దలు నా మోస్తరుగా ఉండవచ్చు. నువ్వు పొరబడుతున్నావేమో." అన్నారు. ఆ యువకుడు నిట్టూర్చి "ఎవరు మీ బోటి వారు లేరు. తల్లిదండ్రులనే పోగొట్టుకున్న దౌర్భాగ్యుణ్ణి, మీలాంటి పెద్దలు దర్శనమైనపుడు చేయెత్తి నమస్కరించాలనిపిస్తుంది." అన్నాడు.

పరమేశం మాష్టారి మనస్సులో ఏదో కలుక్కుమంది. పెద్దలంటే ఎంత పూజ్యభావం ఇంకా ఇటువంటి వారు ఉన్నారా ? అనిపించింది. ఆ యువకుని దగ్గరకు వెళ్ళి ఆప్యాయంగా చేతులు పట్టుకుని పోనీలే బాబు మనకు పూర్వ పరిచయం ఉన్నా. లేకపోయినా ఈ క్షణం నుంచి ఒకరినొకరు సన్నిహితులుగా భావించుకుందాము." అన్నారు. ఇద్దరి కళ్ళల్లోను ఆనందబాష్పాలు నిలిచాయి మాటల మధ్య కాస్సేపటి లోనే వాళ్ళ ఇద్దరి అనుబంధం గురు శిష్యుల అనుబంధంగా గుర్తించారు. పట్టరాని ఆనందంలో ఇద్దరి మనసులు పరవళ్ళు తొక్కుతున్నాయి. ఇంతకీ మీరు ఎక్కడికి బయలుదేరారు మాష్టారు. ఒక్కసారి మాష్టారి ముఖం వివర్ణమైంది. ఇంతవరకు ఆయన ముఖంలో ఉన్న ఆనందపు ఛాయలు అదృశ్యం అయిపోయాయి. ఏమని జవాబు చెప్పాలా అని ఆలోచనలో పడ్డారు. " మీరు వేళ్ళేది అంత అర్జంటు పనికాకపోతే నాతో మా ఊరురండి ఓ రెండు రోజుల ఉండి వెడుదురుగాని" అన్నాడు. మాష్టారుకి తన శిష్యుడి ఇంట గడిపితే మనసుకి శాంతి లభిస్తుందేమో అనిపించింది. మౌనంగా తన దగ్గర ఉన్న టిక్కెట్టు మధు చేతిలో పెట్టారు పరమేశం మాష్టారు.

మాష్టారు దిగవలసిన స్టేషన్‌లో రైలు ఆగగానే మధు దిగి తన ఊరికి టిక్కెట్టు తీసుకు వచ్చాడు. తను కోరగానే తనతో రావడానికి మాష్టారు అంగీకరించడం మధుకు చాలా సంతోషం అనిపించింది. ఆ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ "మాష్టారు నేను ఎంత అదృష్టవంతుణ్ణి ఇలా మిమ్మల్ని కలుసుకోవడం. మీరు నాతో మా ఇంటికి వస్తాననటం నిజంగా నా అదృష్టం" అన్నాడు. "నా అదృష్టం కూడా బాబూ. ఏ నాడో పదేళ్ళ వయస్సు దాకా, అతిపసితనంలో నా దగ్గర చదువుకున్నావు అంత మాత్రానికి నన్ను గుర్తుపట్టి ఇంతగా అభిమానించడం నా అదృష్టం కాదూ". గద్గదిక స్వరంతో అన్నారాయన.

ఇద్దరిని అభినందిస్తున్నట్లుగా కాంతివంతమైన వెచ్చని సూర్యకిరణాలు ప్రసరిస్తున్నాయి. శిష్యుడితో కలిసి రైలు దిగిన మాష్టారికి అంతా ఏదోదైన నిర్ణయంలా అనిపించసాగింది. తను ఒంటరిగా ప్రయాణం ప్రారంభించిన కాస్సేపటికి తన ప్రియ శిష్యుడు మధు తోడయ్యాడు. "ఓరెండు రోజులు తనకి ఇంక ఒంటరితనం అనుభవించవలసిన ఖర్మ రాసిపెట్టి లేదేమో.

ఓ చిన్న ఇల్లు, రిక్షా దిగిలోపలికి వస్తూనే "మాలినీ" అంటూ కేకవేసాడు మధు. ఆమె ఇవతలికి రాలేదు కాని "నాన్నా" అంటూ పరుగున వచ్చి మధు కాళ్ళను చుట్టేసుకుంది కూతుర్ని చూస్తునే మధు నివ్వెరపోయాడు. చింపిర జుట్టుతో బాగా మట్టి పట్టిన గౌనుతో, ఒళ్ళంతా ఇసుకతో అశుభ్రంగా ఉన్న ఆ పసిదాన్ని చూసే సరికి అతనికి బాధ అనిపించింది. "ఏమిటి? అపర్ణా నువ్వు అన్నయ్య ఇవాళ బడికి వెళ్ళ లేదా? అమ్మ ఏదీ ? ఏంచేస్తోంది? అంటూ ప్రశ్నించాడు. బయటనుంచి తండ్రి మాటలు వినిపించే సరికి రాము పరుగున వీధిలోకి వచ్చేసాడు. వాడి అవతారం ఇంచుమించు అలానే ఉంది. మాలిని ఎక్కడికి వెళ్ళి నట్టు? ఇంట్లో పిల్లలు మాత్రమే ఉన్నారు. ఆలోచిస్తూనే లోపలకు నడిచాడు. అతడిని అనుసరించాడు పరమేశం మాష్టారు.

" ఏరా రాము నరసమ్మరాలేదా? అమ్మ ఆఫీసుకు వెళ్లిపోయిందేమిటి? " నిన్నటి నుంచి నరసమ్మ రాలేదు నాన్న. పొద్దున్న నుంచి అమ్మకి పనితోనే సరిపోయింది. మమ్మల్ని తయారు చేసి స్కూలుకి పంపుదామంటే టైము సరిపోలేదమ్మకి. వంట చేయలేదు. టిఫిన్ చేయలేదు. అవును నాన్న నాకు అన్నయ్యకి ఆకలి వేసేస్తోంది. రాము మాటలు పూర్తి చేసింది అపర్ణ. మధుకి తన ఇంటి పరిస్థితి అర్ధం అయింది. అయితే ఇంక తను రంగంలోకి దిగవలసినదే అనుకున్నాడు. "మీరిద్దరూ అల్లరి చేయకండి" అని చెప్పి "మాష్టారు తప్పనిసరై మాలిని ఆఫీసుకి వెళ్ళి ఉంటుంది. చూసారుగా ఈ పిల్లల అవస్థ. మీకు సరియైన ఆతిథ్యం ఇవ్వలేకపోతున్నాను. ఏమి అనుకోకండి అంటూ వంటింట్లోకి దారి తీసాడు.

అపర్ణ అన్నయ్య దగ్గరగా చేరి " అన్నయ్యా ఈ తాతయ్య ఎవరు ? మన తాతయ్యా కదూ అంది. "తప్పు చెల్లీ అలా అందరినీ తాతయ్యా, తాతయ్యా అనేయకూడదు. ఆయనకి కోపం రాదూ "నేను ఏమన్నా అది తప్పు, ఇది తప్పు అంటావు. ఆ తాతయ్య నిజంగా మన తాతయ్య కాకూడదేమిటి? అంటూ బుంగమూతి పెట్టింది అపర్ణ.

"అదికాదు చెల్లాయి. మనకి తాతయ్యలెవ్వరు లేరని అమ్మ, నాన్న చెప్పారుగా మరీ తాతయ్య ఎవరో".

ఆ పసివాళ్ళ మాటలు శ్రద్ధగా వింటున్న మాష్టారు ఉలిక్కిపడ్డారు - నిజంగా తను వాళ్ళకి తాతయ్య కాగల అంతటి అదృష్టం తనకెక్కడిది. తన కొడుకులు, కోడళ్ళు తనని చీదరించుకున్నారు. తన ఉనికినే భారంగా భావించారు ఇంక తన మనవలతో ముద్దు ముచ్చట తనకెక్కడ ?

రాముని చూస్తుంటే మాష్టారులోని మమత పొంగింది. మధు తన దగ్గర చదువుకున్నపుడు అచ్చం ఇలానే ఉండేవాడు ఆ చురుకైన కళ్ళు, చిలిపి మాటలు అంతా తండ్రి పోలిక, మళ్ళీ మధే పసివాడై తనకళ్ళెదుట నిలిచాడా అనిపిస్తుంది.

"నువ్వేం చదువుతున్నావు? బాబు? అప్యాయత నిండిన స్వరంతో అడిగారు.

"నన్నగడలేదు తాతయ్యా" గోముగా అంది అపర్ణ. చెప్పమ్మా, నీపేరేమిటి. " అపర్ణను దగ్గరకు తీసుకుంటూ అన్నారు. మాష్టారు. " నాపేరు అపర్ణ.ముద్దు ముద్దుగా చెప్పింది. మాష్టారు అపర్ణని ముద్దుపెట్టుకున్నారు. రాముని కూడ తల నిమిరి దగ్గరకు తీసుకున్నారు. అపర్ణ మాష్టారి ఒళ్ళో కూర్చొంది. రాము మాష్టారికి ఎంతో సన్నిహితంగా కూర్చున్నాడు. ఎంతో చనువుగా పిల్లలిద్దరు మాట్లాడటం మొదలు పెట్టారు.

"తాతయ్యా! నిన్ను మేము ఎంచక్కా తాతయ్య అనే పిలుస్తాం" "అలాగే నమ్మా, నేను మీకు తాతయ్యనే" రాముకి కూడ ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. "భలే, భలే, నువ్వు మా తాతయ్యవే అంటూ గంతులేసాడు. మాష్టారు కోసం కాఫీ తీసుకువచ్చిన మధు " అరే, మాష్టారు అపుడే ఈ వాగుడు కాయలు మిమ్మల్ని అల్లరి చేయటం మొదలుపెట్టినట్టున్నారు. " తప్పమ్మా అపర్ణా, అలా ఒళ్ళో కూర్చోవచ్చా. రాము ఏమిటా అల్లరి" అన్నాడు.

"అలా అనకు మధు బాబు, వాళ్ళ అల్లరి, ముద్దు మాటలు నాకు ఎంతో ముచ్చటగా ఉన్నాయి. చాలాకాలం తరువాత నా హృదయానికి సంతోషంగా ఉంది. బీటలు వారిన పుడమిపై తొలకరిజల్లు కురిసినట్లు ఈ అల్లరి, వాళ్ళ చిలిపి చేతలు నాకు హాయిని ఇస్తున్నాయి." అంటూ మధు మాటలు బదులు ఇచ్చారు మాష్టారు.

"అలా అయితే నాకు మరీ సంతోషం మాష్టారు. వీళ్ళు మరీ గడుగ్గాయిలు మిమ్మల్ని ఏం ఇబ్బంది పెట్టేస్తారో అని అలా అన్నాను. "రామూ, అపర్ణా ఆకలివేస్తోంది అన్నారుగా, పాలు తాగుదురుగాని పదండి" అన్నాడు "ఎంచక్కా మేం ఇద్దరం తాతయ్య దగ్గరే కూర్చుని పాలు తాగుతాం" అంది అపర్ణ ఇద్దరూ వంటింట్లోకి పరుగెత్తి క్షణంలో పాల గ్లాసులతో తిరిగి వచ్చారు. మళ్ళీ కబుర్లు చెప్పటం మొదలు పెట్టారు. అపర్ణ మాష్టారి ఒళ్ళో కూర్చుని పాలు తాగుతోంది. ఆ దృశ్యం మాలినిని ఆశ్చర్య పరిచింది. తప్పనిసరి పరిస్థితులలో పిల్లల్ని ఒక్కళ్ళన్ని వదిలి వచ్చింది. "వాళ్ళు ఈ కొన్ని గంటలసేపు ఎలా ఉన్నారో? అనుకున్న వేళకు తన భర్త ఊరి నుంచి తిరిగి రాగలిగాడో లేదో? ఆకలితో అపరిశుభ్రంగ ఉన్న తన పసి కూనలు ఏంచేస్తున్నారో? ఎలా ఉన్నారో? అసలు స్త్రీకి ఉద్యోగం చేయవలసి రావటం ఓ విధంగా చాలా దురదృష్టం, కన్న బిడ్డల్ని తను పాపల్లా పెంచుకోవటం అనే అదృష్టానికి దూరం అయిపోవటమే. ఇలా ఎన్నో రకాల ఆలోచనలతో సతమతం అయిపోతూ ఇల్లు చేరిన మాలిని తన బిడ్డలను ఎంతో ప్రేమగా చేరదీసి, ఒడి చేర్చి లాలిస్తున్న ఆవ్యక్తి భగవంతునిలా కనిపించారు. అప్రయత్నంగానే రెండు చేతులు జోడించి "నమస్కారమండీ" అంది. "అదిగో తాతయ్య, అమ్మ వచ్చేసింది". అన్నాడు రాము "అమ్మా

మన తాతయ్య భలేమంచి వాళ్ళు. మాకు బోలెడు కబుర్లు, కథలు చెపుతున్నారు." అంది అపర్ణ. ఆ పసివాళ్ళ ఉత్సాహం చూస్తుంటే మాలినికి ఆ వ్యక్తి పట్ల మరింతా పూజ్యభావం కలిగింది.

ఆ పూజ్య భావంతోనే ఆ దంపతులు పరమేశం మాష్టారిని ఓ దేవునిలా చూడసాగారు. మాష్టారికి కూడ ఆ ఇంట్లో తన జీవితం ఎంతో మారిపోయినట్టు అనిపించసాగింది. మధు, మాలిని తనకు ఎంతో ఆప్తులుగా ఆ పసివాళ్ళు తనకు ఆరోప్రాణంగా అనిపించసాగారు. రోజొక క్షణంలా ఓ వారం గడిచింది. గతం మాత్రం ఓ పీడకలలా వెంటాడుతుంది. తనసలు ఈ ఇంటికి ఎందుకువచ్చారు ? ఎలా రాగలిగాడు? తను ప్రారంభించినది గమ్యం తెలియని ప్రయాణం ఈ ఆనందం, ఆత్మీయత శాశ్వతం కాదు. ఇది ఓ మజిలీ అనుకోగానే మాష్టారి హృదయం బరువెక్కిపోయింది. పట్టె మంచం, పరుపు పైన పడుకున్నా అతని కనులకు నిద్రకరువైంది. ప్రక్కగదిలో మధు దంపతుల సంభాషణ అతని చెవిలో పడుతోంది.

"చూడు మాలిని. పిల్లలు మాష్టారు దగ్గర ఎంత చేరిక అయిపోయారో, రాత్రులు పడుకోవటానికి కూడ మన దగ్గరకు రావటం మానేసారు." "అంతే కాదండీ, అల్లరికూడా చాలవరకు తగ్గిపోయింది. చీటికి మాటికి మారాము చేయటంలేదు." " అవును మాలినీ అదే ఇంటి పెద్ద వాళ్ళు ఉంటే ప్రయోజనం, చూడు మనకు కూడ మాష్టారి ఉనికి ఎంతో హాయిని ఇస్తోంది."

" ఏ నిముషానైనా మధూ, మా ఊరు వెళ్ళి పోతానోయ్. అన్నమాట మాష్టారి నోటి నుండి వినవలసి వస్తుందోనని భయంగా ఉంది." " భయమేమిటండీ, ఎలాగా జరిగేదే. నేడో రేపో ఆయన ఆ మాట అననే అంటారు." సంభాషణ ఇలా సాగిపోతోంది ఆపైన మాష్టారికి మరేం వినిపించలేదు.

"అంటే తన ఉనికి వాళ్ళకి అంత ఆనందాన్ని కల్గిస్తోందా? ఒక ఇంటికి బరువైన చెట్టు, ఇంకొక ఇంటికి నీడనిచ్చి, చల్లని గాలిని ఇస్తోందా? ఇదే మనస్తత్వాల మధ్య ఉండే వ్యత్యాసం. అయిన వాళ్ళు కొడుకు కోడలు తనను అసహ్యించుకుంటే, తనకేమికాని వీళ్ళు తనని ఆదరించటం. మమత విలువ తెలిసేది కొద్ది మనసులకేనేమో, ఇంక తన కథ వాళ్ళకి చెప్పకుండా ఉండలేక పోయారు. ఆక్షణం నుంచి ఆ ముగ్గురి మధ్య రాగబంధం పెనవేసుకుపోయింది.

❑